ప్రజాశక్తి
మంగళవారం 6 ఆగస్టు 2024





అమరావతిలో సిఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల సదస్సుకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు బిఆర్ అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్ హాజరయ్యారు. విజయనగరం జిల్లాలోని పరిస్థితులపై కలెక్టర్ అంబేద్కర్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

- ప్రజాశక్తి, విజయనగరంకోట



ధర్నా చేస్తున్న స్కీమ్‌వర్కర్లు, సిఐటియు నాయకులు

స్కీమ్‌వర్కర్లు.. కార్మికులు.. దళితులు.. గిరిజనుల ధర్నాలు, ఆందోళనలతో సోమవారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ దద్దరిల్లింది. రాజకీయ వేధింపులు, తొలగింపులపై స్కీమ్‌వర్కర్లు, విఒఎలు, గ్రీన్ అంబాసిడర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడితే... అక్రమ లాకౌట్ ప్రకటించిన నెల్లిమర్ల జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మికులు ఆందోళన చేశారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోడు పట్టాలివ్వాలని ఆదివాసీలు రాస్తారోకో నిర్వహిస్తే... ఎస్‌సి కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని దళితులు నినదించారు. ఇలా పలు సమస్యలపై పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు.

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్



ఆందోళన చేస్తున్న దళితులు, కెవిపిఎస్ నాయకులు

దద్దరిల్లిన కలెక్టరేట్

వేధింపులు, తొలగింపులపై స్కీమ్‌వర్కర్ల కన్నెర్ర

జిల్లాలో స్కీమ్‌వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, వి.లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు అనేక ఆశలతో అత్యధిక మెజార్టీ ఇచ్చి ఎన్నుకున్నారన్నారు. రాజకీయాలకతీతంగా పాలన సాగిస్తారని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామన్నారు. కానీ 'మా ప్రభుత్వం వచ్చింది. ఇక మీరు వెళ్లిపోండి. మా వాళ్లను వేసుకుంటా'మంటూ గ్రీన్ అంబాసిడర్లులు, విఒఎలు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ ఆయాలపై కూటమి నాయకులు, కార్యకర్తలు ఒత్తిడిని చేస్తున్నారని, ఇదేమి పద్ధతని ప్రశ్నించారు. లక్కవరపుకోటలో 18 మంది గ్రీన్ అంబాసిడర్లను, డెంకాడలో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించారని తెలిపారు. రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, స్కూల్ ఆయాలకు నెలల తరబడి జీతాలు, ఇతర బకాయిలు ఉన్నాయన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 2022లో బకాయి బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గ్యాస్ ఉచితంగా ఇవ్వాలన్నారు. విజయనగరం కార్పొరేషన్ లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సంక్రాంతి కానుక రూ.వెయ్యి చెల్లించాలన్నారు. థర్డ్ పార్టీ విధానంలో ఉన్న పంప్ హౌస్, ప్లాంటేషన్, లీకులు, మొక్కలు పార్కుల్లో పనిచేసే వారికి బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలల హెల్త్ అలవెన్సులు చెల్లించాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి అందించారు.

కార్పొరేషన్ రుణాల కోసం దళితుల పట్టు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరించాలని, స్వీయ దరఖాస్తుల ఆధారంగా డప్పు కళాకారులకు, చర్మకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్.రాములు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వెంకటరావు, ఆర్.ఆనంద్ మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యం చేసిందన్నారు. దీంతో గడిచిన ఐదేళ్లలో దళితులు సంక్షేమానికి, స్వయం ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరణ చేస్తే దళితుల్లో నిరుద్యోగులైన యువతకు కాస్తా స్వయం ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌సి కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, రుణాలు మంజూరు చేయాలని కోరారు. 2019లో డప్పుకళాకారులకు, చర్మకారులకు జిఒ 199 ద్వారా స్వీయ దరఖాస్తుల ఆధారంగా పింఛన్లు అప్పటి టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. అదే టిడిపి ప్రభుత్వం గుర్తింపు కార్డుల పేరుతో వారి పింఛన్లను తొలగించేందుకు పూనుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. డప్పు కళాకారులు కొంతమంది గుర్తింపుకార్డులు పొందినా, చర్మకారులకు ఏరకమైన గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదని తెలిపారు. బస్సుపాస్ సౌకర్యం కల్పించాలని, భూమిలేని దళితులకు రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని, ఇప్పటికే దళితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రూ.5 వేలకు పింఛను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.బలరాం, కృష్ణారావు, సన్యాసి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఆదివాసీలు, గిరిజన సంఘాల జెఏసి నాయకులు

పోడు పట్టాలివ్వాలని రాస్తారోకో

పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని, గిరిజన గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఎపి ఆదివాసీ జెఎసి వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బొబ్బిలి, దత్తిరాజేరు మండలాల్లో ఉన్న గిరిజనులకు కరెంటు, మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. శృంగవరపు కోట మండలంలో దారపర్తి, లక్ష్మీపురం పంచాయతీల్లోని పదుల సంఖ్యలో గ్రామాలకు రోడ్డు లేక, మౌలిక సదుపాయాలు లేక చిన్నారుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వేపాడ మండలం మారిక గ్రామానికి రోడ్డు పూర్తి చేయాలన్నారు. కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెం పంచాయతీలో గిరిజన యూనివర్సిటీకి భూమి ఇచ్చిన గిరిజనులకు భూమి ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గంట్యాడ మండలంలో డి.కె.పర్తి పంచాయతీలో ఎన్నో గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌పై బోటు సదుపాయం కల్పిస్తే డ్యామ్ వెనుక గ్రామాలకు రవాణా సౌకర్యంతో పాటు పర్యాటక అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు బురిడి చిన్న లక్ష్మణ్, సిమ్మడు, బంగార్రాజు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న జ్యూట్ కార్మికులు, ఐఎఫ్‌టియు నాయకులు

చట్ట విరుద్ధంగా జ్యూట్ మిల్లును మూసేసిన నెల్లిమర్ల జ్యూట్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.అప్పల సూరి, బి.గీత మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా నోటీసులు ఇస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. చట్టవిరుద్ధంగా నో వర్క్ నో పే సూత్రాన్ని వర్తింప జేస్తోందని విమర్శించారు. వాస్తవానికి లే ఆఫ్ అమలు చేయాల్సి ఉన్నా, ఎంతో కాలం నుండి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంటుగా మార్చాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే మిల్లు తెరవాలని డిమాండ్ చేశారు.

నెల్లిమర్ల : జ్యూట్‌మిల్లు తెరవాలని భోగాపురం మండలం ముంజేరులో ఎమ్మెల్యే లోకం మాధవిని ఆమె నివాసంలో ఐఎఫ్‌టియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, బి.గీత, కె.అప్పలసూరి కలిసి వినతి అందించారు.

బాధితుల సమస్యలపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధితుల అందించిన అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఎస్‌పి అస్మా ఫర్హీన్.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఎఎస్‌పి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఎఎస్‌పి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు 35 ఫిర్యాదులు అందాయి. వీటిలో కుటుంబ కలహాలు-8 ఫిర్యాదులు, భూ తగాదాలు- 17, మోసాలు-3, ఇతర విషయాలు-7 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఎస్‌బి సిఐ ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, డిసిఆర్‌బి ఎస్‌ఐలు మురళి, గణేష్ పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ విజేత విజయనగరం

విజయనగరం టౌన్ : రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో విజేతగా విజయనగరం జిల్లా బాలికల జట్టు నిలిచింది. ఈ నెల 2 నుంచి నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో బాలికల జట్టు సత్తాచాటింది. ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా జట్టుకు ఎమ్‌పి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ట్రోఫీ అందజేశారు. జిల్లా క్రీడాకారులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ ఈశ్వరరావు తదితరులు అభినందించారు.

'ఎంఆర్ ఫార్మసీ'లో ఇండక్షన్ ప్రోగ్రాం

విజయనగరం : మహారాజా ఫార్మసి కళాశాలలో ఈనెల 3,4 తేదీల్లో ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది. 'నావిగేషన్ ది ఆర్ట్ ఆఫ్ టీచింగ్ ఎ హోలిస్టిక్ అప్రోచ్'పై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉదయ్‌శంకర్ వివరించారు. విద్యార్థులను ఏవిధంగా తీర్చిదిద్దాలి, భావి భారత పౌరులుగా మార్చాలో తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు 265 అర్జీలు



సోలార్ పవర్‌ప్లాంట్ సమస్యను డిఆర్‌ఒకు వివరిస్తున్న టిడిపి నాయకులు


ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ (స్పందన)కు వినతులు వెల్లువెత్తాయి. ఈ వారం కూడా రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 265 అర్జీలు అందాయి. భూ సమస్యలకు సంబంధించి 130, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 87 వినతులు అందాయి. ఇంకా విద్యాశాఖకు 4, మున్సిపాలిటీకి 10, విద్యుత్ శాఖకు 8, పంచాయతీ శాఖకు 12, గ్రామ వార్డు సచివాలయాలకు 6, వైద్య ఆరోగ్య శాఖకు 5, డిసిహెచ్‌ఎస్ 2, హౌసింగ్‌కు 1 వినతులు వచ్చాయి. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని డిఆర్‌ఒ కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, సుమబాల కూడా వినతులు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి

ద్వారపూడి గ్రామం వద్ద కొండపై ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ టిడిపి నియోజకవర్గ నాయకులు గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి అందించారు. దీనిపై వైసిపి హయాంలో చర్యలు తీసుకోవాలని మూడుసార్లు గ్రీవెన్స్‌లో వినతులు అందించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, వై.శ్రీనివాసరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరంకోట : హాస్టళ్లలో సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని అభిలషించారు. సోమవారం నగరంలోని మహారాణిపేటలో గిరిజన సంక్షేమ, జమ్ములో జ్యోతిరావుపూలే వసతిగృహాలను, డబుల్ కాలనీలోని కెజివిబిని ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఉపయోగపడే నిర్ణయాలు చేసిందన్నారు. హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయా హాస్టళ్ల నిర్వాహకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు తన వంతు సాయంగా ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యాన సోమవారం విరాళాలు సేకరించారు. ప్రజాశక్తి సిబ్బంది, విలేకర్లు విరాళాలు ఇవ్వడమే కాకుండా ఆర్‌అండ్‌బి జంక్షన్ చుట్టుపక్కల షాపులు, రైతుబజారులో నిధులు సేకరించారు. మొత్తంగా రూ.7800 ను సేకరించారు. ఈ మొత్తాన్ని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం పంపిస్తామని ప్రజాశక్తి జిల్లా మేనేజర్ సిహెచ్ రాము తెలిపారు. వయనాడ్‌లో జరిగిన విపత్తు కారణంగా 300 మంది మృత్యువాత పడ్డాయని, వందలాది మంది క్షతగాత్రులు అయ్యారని తెలిపారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా తమ వంతు సాయం అందించాలని కోరారు.

ఘనంగా సిటియు వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



మాట్లాడుతున్న విసి కట్టిమణి

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఆరో వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని సిటియు వైస్ చాన్సలర్ తేజస్వి కట్టిమణి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు వసంతాలను పూర్తి చేసుకున్న యూనివర్సిటీ ఎన్నో మైలు రాళ్లను దాటిందన్నారు. ఎన్నో పరిశోధనాత్మకమైన, విద్యా పరమైన విజయాలను చవిచూసిందని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి పథంలో నడవాలంటే మంచి బోధనా సిబ్బంది, లేబోరేటరీలు, హాస్టళ్లు, ఆటస్థలం, తదితర సౌకర్యాలు ఉండాలని, వాటిని సమకూర్చడానికి యాజమాన్యం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిటియు రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్‌చంద్ర బాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, చైర్మన్ డా.అనిరుధ్ కుమార్, డా.పరికిపండ్ల శ్రీదేవి, డా.దివ్య, డా.ప్రమా, ఎఒ ఎన్‌విఎస్ సూర్యనారాయణ, గంగునాయుడు పాల్గొన్నారు.

'ఎటిఎల్ మారథాన్'లో సత్తాచాటిన ఫోర్ట్‌సిటీ విద్యార్థులు

విజయనగరం టౌన్ : అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఎటిఎల్) ఉన్న పాఠశాలలకు సంబంధించి ఎటిఎల్ మారథాన్ 2033-24 పేరుతో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లాకు చెందిన ఫోర్ట్‌సిటీ పాఠశాల ప్రాజెక్టు ఎంపికైంది. ఫోర్ట్‌సిటీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు ఎం.నిఖిల్, డి.కార్తికేయ, ప్రణయ్ కౌశిక్ 'సమగ్ర నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ' అనే ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు వల్ల మనం తాగేనీరు స్వచ్ఛమైనదా? కాదా? అని సులభంగా తెలుసుకోవచ్చని, అనారోగ్యం బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని, తక్కువ ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్టు సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటుందని విద్యార్థులు వివరించారు. జాతీయ స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు(శివ) అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.

'సత్య'లో సాఫ్ట్‌స్కిల్స్‌పై వర్క్‌షాప్



ఎపిఎస్‌ఎస్‌డిసి అధికారులను సత్కరిస్తున్న డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెంలోని సత్య డిగ్రీ, పిజి కళాశాలలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ పదో తేది వరకు 30 రోజుల పాటు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌జిబిఎస్ ఉన్నతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శిక్షణను ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఎం.వి.సాయి దేవమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ఎపిఎస్‌ఎస్‌డిసి అధికారులు పి.సురేష్, ఎస్.షణ్ముఖరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ తరుణ్ పట్నాయక్, ఉన్నతి ఫౌండేషన్ ట్రెయినర్లు ప్రత్యూష, శాంతిలత పాల్గొని, మాట్లాడారు.

సీతంలో బిబిఎ, బిసిఎ కోర్సులు

ఈ ఏడాది నుంచి జెఎన్‌టియు-జివి, సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల (సీతం) అనుసంధానంతో కొత్త కోర్సులను ప్రారంభించారు. డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ), బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బిసిఎ) కోర్సులు ప్రారంభించారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, కౌన్సిలింగ్‌లో బిబిఎ, బిసిఎ కోసం జెఎన్‌టియు-జివి పరిధిలోని సీతం కళాశాలను ఎస్‌జివిపి కోడ్‌తో వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ఒక ప్రకటనలో కోరారు.

సెప్టెంబర్ 30కి అందుబాటులోకి బిఎస్‌ఎన్‌ఎల్ 4జి

విజయనగరం టౌన్ : సెప్టెంబర్ 30 నాటికి జిల్లాలో 4జి నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ మర్రి నాయుడు తెలిపారు. సోమవారం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, పార్వతీపురం అర్బన్ లో 4జి నెట్‌వర్క్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 228 టవర్లు ఉన్నాయని చెప్పారు. 4జి సేవలు లేని గ్రామాల్లో 42 టవర్లు నిర్మించామని, బిఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్ సేవలు కూడా విస్తృతం చేస్తున్నామని, కొత్త కనెక్షన్లకు ఒక నెల ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. 4జి సేవలను ఉచితంగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. గతనెలలో 85 వేల సిమ్ కార్డులు అందించామని, తక్కువ రేటుతో పాపులర్ ప్లాన్లు ఉన్నాయని వివరించారు.

అయ్యప్పనగర్ పార్కు శుభ్రం

విజయనగరం టౌన్ : అయ్యప్పనగర్ పార్కులో జంగిల్ క్లియిరెన్స్ చేపట్టాలని ఆ కాలనీ పోరాట కమిటీ మున్సిపల్ కమిషనర్‌కు వినతి అందించింది. వెంటనే కమిషనర్ స్పందించి సోమవారం జెసిబి పంపించి పార్కును శుభ్రం చేయించారు. కుక్కలను పట్టుకుని వేరేచోటికి తరలించారు. వీధిలైట్లు వేశారు. ప్రజా సమస్యపై స్పందించి 48 గంటల్లోనే చర్యలు తీసుకున్న కమిషనర్‌కు పోరాట కమిటీ సభ్యులు యుఎస్ రవికుమార్, సుధీర్, జలగం వెంకట్ రావు, మురళీ, సుదర్శన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న కాలువల్లో పూడిక తీత ప్రక్రియను కమిషనర్ ఎం.ఎం.నాయుడు పరిశీలించారు. నగరంలోని విటి అగ్రహారం, రైల్వేస్టేషన్ ప్రాంతాలలో సోమవారం పర్యటించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని గమనించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏ ప్రాంతంలో కూడా కాలువల్లో పూడిక నిల్వ ఉండడానికి ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. నగరంలో 49వ నెంబరు సచివాలయాన్ని కమిషనర్ ఎంఎం నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పౌర సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు.

వినతులు స్వీకరణ

కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 9 వినతులు వచ్చాయి. ఆయా వినతుల పరిష్కారానికి సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఎం.ఎం.నాయుడు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని చందులూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాహసం ట్రస్ట్ వ్యవస్థాపకులు మాకవరపు గణేష్ సహకారంతో సహసం డిజిటల్ హబ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సోమవారం ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్ట్ చైత్రలో భాగంగా వెనుకబడిన తరుగతులకు చెందిన విద్యార్థులను ఉన్నత చదువులు వరకు చదివించే బాధ్యతను తీసుకొనే ధ్రువీకరణ పత్రాన్ని లలిత కుమారి చేతుల మీదుగా సదరు విద్యార్థినికి అందించారు. పాఠశాలలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్.కోట టిడిపి మండల అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల జ్యూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జ్యూట్ మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం పిఎఫ్, ఇఎస్ఐ బకాయిల సంబంధిత అధికార్లకు కట్టలేదని దీని ఫలితంగా రిటైర్డు కార్మికులకు ఫించన్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు పొందలేక పోతున్నారని చెప్పారు. 2016 నుంచీ ఇప్పటి వరకు రిటైర్డు కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిల కూడా జ్యూట్ యాజమాన్యం చెల్లించలేదని వినతి పత్రంలో తెలిపారు. కార్మికుల నుంచి జ్యూట్ యాజమాన్యం అప్పుగా 5,10,18 రూపాయలు తీసుకుందని, ఇలా 5వేల మంది కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.52, 600 తిరిగి చెల్లించాల్సి ఉన్నా ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. యాజమాన్యం ఎప్పటికప్పుడు లాకౌట్ చెసి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ జ్యూట్ కార్మికుల సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రిటైర్డ్ కార్మికులు కొండల కరువులు, మణ్యపురి సన్యాసిరావు, కార్మికులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లాన లక్ష్మీ, కార్యదర్శి చల్లా రాము తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 30,31, తేదీల్లో మూడు రోజుల పాటు అనకాపల్లిలో రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికలు, మహిళా, పురుష విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఈ నెల 10 నుంచి కొండవెలగాడ కోచ్ చల్లా రాము వెయిట్ లిఫ్టింగ్ కేంద్రంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ ఎంపికలకు ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఐడి కార్డుతో హాజరు కావాలన్నారు. కాగా ఎంపికలో సెలెక్ట్ అయిన వారు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9490949759 ని సంప్రదించాలని కోరారు.

వరి సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామరాపల్లి, సిరిపురం గ్రామాల్లో సోమవారం వరి పంటపై రైతులకు వ్యవసాయ రీజనల్ అధికారి హేమ సుందర్, అడిషనల్ డిపిఎం సోమనాయుడు, పిఇ అనిత అవగాహన కల్పించారు. గ్రామాల్లో వరి ఉడుపులను పరిశీలించి వరిలో లైన్స్ షోయింగ్ విజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఈశ్వరమ్మ, యూనిట్ ఇంచార్జిలు ఎర్నిబాబు, గాయత్రి ఫార్మర్స్ సైంటిస్ట్ ఐసిఆర్‌పిఎస్‌లు పాల్గొన్నారు.

వెంగళరాయ సాగర్‌లో పూడిక తీత

ప్రజాశక్తి- బొబ్బిలి

వెంగలరాయ సాగర్ సాగునీటి కాలువలో పూడికలు పేరుకుపోయాయి. దీంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. సాగునీటి సమస్యను ఎమ్మెల్యే బేబినాయనకు గొల్లపల్లి రైతులు వివరించడంతో సొంత నిధులతో సాగునీటి కాలువలో పూడికలను తీస్తున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందించేందుకు పని చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయనకు రైతులు కృతజ్ఞతలు చెపుతున్నారు.

పాఠశాలల్లో క్రీడాపోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు సగబంది శివ రామకృష్ణ ఇతర ఉపాధ్యాయులు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, లోకిరెడ్డి కృష్ణలు మాట్లాడుతూ మండలంలో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను బాలురు, బాలికలకు నిర్వహిస్తామన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి

సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శానిటేషన్ సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించడంతో అన్ని వార్డులలో అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు.

ప్రాధాన్యత క్రమంలో ఇసుక సరఫరా చేయాలి

బొబ్బిలి: ప్రాధాన్యత క్రమంలో ఇసుక సరఫరా చేయాలని తహశీల్దార్ ఎం.శ్రీను కోరారు. గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఇసుక కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీరియల్ ప్రకారం ముందు వచ్చిన వాహనాలకు ఇసుక ఇవ్వాలని సూచించారు. ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి ఉన్నారు.

విఆర్ఎలకు నైట్ డ్యూటీలు వద్దు

ప్రజాశక్తి-: మండలంలో విఆర్ఎలకు నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేయవద్దని, తెలంగాణ ప్రభుత్వం విఆర్ఎలకు ఇస్తున్న విధంగా వేతనాలు ఇవ్వాలని విఆర్ఎల సంఘం నాయకులు గట్టు వెంకన్న కోరారు. సోమవారం విఆర్ఎల సమస్యలపై తహశీల్దార్ డి. సన్యాసినాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఇంతవరకు నామినీగా పనిచేస్తున్న విఆర్ఎలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న విఆర్ఎలు పాల్గొన్నారు.

190 మంది కౌలురైతులకు రుణాలు

రేగిడి: మండలంలోని 25 సచివాలయాల పరిధిలో 190 మంది కౌలు రైతులను గుర్తించి బ్యాంకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎఒ గిరడ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం రేగిడి యూనియన్ బ్యాంకు, ఉంగరాడమెట్ట ఎపిజివిబి బ్యాంక్, దేవుదల స్టేట్ బ్యాంకు, ఉణుకూరు యూనియన్ బ్యాంక్‌లో కౌలు రైతులకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఆయన తెలిపారు. గత 20 రోజులుగా వ్యవసాయ సహాయకులు కౌలు రైతులకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన కౌలు రైతులకు ఇచ్చిన రుణాలకు సంవత్సరం లోపు కట్టుకుంటే వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు కౌలు రైతుల జాబితాను అందజేశారు. రైతులతో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు

భోగాపురం: వివిధ సమస్యలపై తహశీల్దార్‌కు పలువురు సోమవారం ఫిర్యాదు చేశారు. విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు కోసం తక్కువ భూమిని భూమి నష్టపరిహారం ఇచ్చి ఎక్కువ భూమిని తీసుకుంటున్నారని భోగాపురం గ్రామానికి చెందిన మాత కోరిమని ఫిర్యాదు చేశారు. మాకు రావాల్సిన నష్టపరిహారాన్ని వేరొక రైతుకు వేయడంతో ఆ సమస్య వచ్చిందని తెలిపారు. మండలంలోని విఆర్ఓలు తమ సమస్యలపై రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. జగనన్న కాలనీలో పట్టాలు ఇచ్చారు కాని సంబంధిత స్థలాన్ని తమకు అప్పజెప్పలేదని తూడెం పంచాయతీకి చెందిన 32మంది లబ్దిదారులు ఫిర్యాదు చేశారు. సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సురేష్ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి : యుటిఎఫ్

- సభ్యత్వ నమోదులో రాష్ట్ర కార్యదర్శి మోహనరావు
- పలుచోట్ల ఎంఇఒలకు వినతి పత్రాలు

ప్రజాశక్తి- వంగర

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని, అసంబద్ధ ఉపాధ్యాయుల సర్దుబాటును నిలుపుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వంగర మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. 117 జిఒను రద్దు చేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పని భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండు మీడియంలో బోధన కొనసాగించాలని, పాఠశాల మెంటెనెన్సు గ్రాంట్ విడుదల చేయాలని, అసంబద్ధ ఆన్‌లైన్ ఉపాధ్యాయుల సర్దుబాటు ఆలోచన నుంచి విరమించాలని చెప్పారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంబోతుల రమణ, కె చూడమనేందర్, కె తిరుపతి రావు, పి మురళి, కె తిరుపతి రావు, వై మురళి పాల్గొన్నారు.

మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి: యుటిఎఫ్

కొత్తవలస: ఎన్నికలకు ముందు 117 జీవోను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ మండలశాఖ డిమాండ్ చేసింది. గత ప్రభుత్వంలో ఎన్‌ఇపి పేరుతో 117 జీవోను తీసుకొచ్చి


వంగర: మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులను కిలోమీటర్ లోపు ఉన్న యుపి, హైస్కూల్లో మెర్జ్ చేయడం వల్ల ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థ మొత్తం దెబ్బతిందన్నారు. అందువల్ల ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే ప్రాథమిక పాఠశాలగా నడపాలన్నారు. అనేక స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రద్దు అయ్యాయి కాబట్టి హైస్కూల్స్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహించాలన్నారు. అన్ని పాఠశాలకు రావలసిన పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలని తదితర డిమాండ్లతో స్థానిక ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి. హెచ్ నిర్మలదేవి, జి. విజయగౌరి జిల్లా కార్యవర్గ సభ్యులు వి. సురేషకుమార్, టి.వినోద్ కుమార్, పి.రమేష్, జి.వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒలకు వినతి పత్రం

గంట్యాడ: ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని యు టిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం గంట్యాడ ఎంఇఒ 1,2 వి.విజయకుమారి, ఎస్ వెంకట్రావులకు మండల శాఖ తరపున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి నాయుడు మాట్లాడుతూ ఎన్నికలు ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం 117 జీవోను రద్దు చేయాలన్నారు. హైస్కూల్ పోస్టులు రద్దు అయ్యాయి కాబట్టి హైస్కూల్లో తెలుగు ఇంగ్లీష్ మీడియంలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గంట్యాడ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి శ్యామ్ కుమార్, జి. మురళీమోహన్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి రమణ, కోసాధికారి బి సాంతేశ్వరరావు, మండల కార్యదర్శి వి రామ బ్రహ్మ, కె ఏసుబాబు, వి మోహన్ రావు, పి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ద్వారా మంచి అవకాశాలు

ప్రజాశక్తి- భోగాపురం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్మీడియట్ కోర్సులు చదువుకు నేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందని ఎంఇఒ-2 బాలిపల్లి చంద్రమౌళి అన్నారు. మండల స్థాయి అధికారులతో ఎంపిడిఒ చంద్రకళ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ మధ్యలో ఆపేసిన వాళ్ళు, ఉత్తీర్ణత సాధించని వాళ్ల అక్కడితో ఆగిపోకుండా ఇదొక చక్కని అవకాశమని అన్నారు. ఎంపిడిఒ చంద్రకళ మాట్లాడుతూ మహిళలకు పలు రకాల వృత్తుల్లో ఉన్నవారికి, వ్యాపార, డ్వాక్రా సంఘాల సభ్యుల్లో ఇలాంటి వారిని గుర్తించాలని సూచించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు కోసం ఆయా గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలు, మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ రమణమూర్తి, విద్యుత్ శాఖ


భోగాపురం: మాట్లాడుతున్న ఎంఇఒ చంద్రమౌళి

ఎఇ మస్తాన్ వలి, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎమ్ రమణ, ఎఒ హరికృష్ణ, వైద్యాధికారి తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: చదువుకోవాలనే కోరిక ఉన్నవారికి ఏపి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపిడిఒ హరిహరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంఇఒ శోభారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పదోతరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు వివిధ కారణాల వల్ల చదువు కొనసాగించలేని వారికి ఏపి ఓపెన్ స్కూల్ వరం లాంటిదని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల వారికి ముఖ్యంగా బాలికలు, గ్రామీణ యువతకు విద్యనందించడమే ఏపి ఓపెన్ స్కూల్ ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామ స్థాయి అధికారులు చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంఇఒ-2 అల్లు వెంకట రమణ, ఎపిఒ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాడంగి: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎంఇఒ లక్ష్మణ్ దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఆగష్టు 28 వరకు ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ కట్టవచ్చు అని తెలిపారు. గతంలో చదువు మధ్యలో ఆపేసిన, ఉద్యోగం నిమిత్తం ప్రమోషన్ పొందడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం గొల్లాది ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ని 94949 76647 సంప్రదించాలని అన్నారు.

అవకతవకలపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గత వైసిపి ప్రభుత్వం హయాంలో వైసిపి నాయకులు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ మండల టిడిపి అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్‌తో పాటు మండల నాయకులు ఎంపిడిఒ శ్యామల కుమారికి సోమవారం ఫిర్యాదు చేశారు. గత మూడేళ్ళగా వివిధ పద్దుల కింద వచ్చిన నిధులు వైసిపి నాయకులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేటాయించిన దీన్ దయాల్ పథకం కింద వచ్చిన 25లక్షల రూపాయలతో చేసిన పనులకు సరైన రికార్డులు చూపించకుండా డబ్బును దుర్వినియోగం చేసినట్లు అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలపరిషత్ సాధారణ, ఇతర నిధులకు తప్పుడు ఓచర్లు, తప్పుడు లెక్కలతో డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వివిధ రకాల చెట్లు అక్రమంగా నరికి వైసిపి నాయకులు సొమ్ము చేసుకుని బుక్కేశారని ఆరోపించారు. ఇటీవల సచివాలయ భవనాలకు కేటాయించిన పదివేల సిమెంట్ బస్తాలు పక్కతోవ పట్టడం పంచాయతీ రాజ్ ఎఇ రామకృష్ణ ఆత్మహత్య చేసుకోవడంపై వైసిపి నేతలే కారణమైనట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, మాజీ జెడ్‌పిటిసి ఉషారాణి, నాయకులు పాలూరి రామినాయుడు, కర్నేన మహేష్, పాలవలస రామచంద్రినాయుడు, కోటినాయుడు, శాసపు గోవింద నాయుడు, గిరడ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొట్టాం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణి ప్రారంభించారు. ఈ శిబిరంలో కొట్టాం పిహెచ్‌సి వైద్యాధికారి జె.హారిక సేవలందించారు. శిబిరానికి హాజరైన పలువురు రోగులు, న్యాయవాదులకు బిపి, షుగర్, లివర్, కిడ్నీ తదితర పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం పిహెచ్‌సిలోని పలు విభాగాలు, అందుబాటులో ఉన్న మందులను న్యాయమూర్తి పరిశీలించారు. అత్యవసరమైన కుక్కకాటు, పాముకాటు మందులు, హెపటైటిస్, బిసిజి వంటివి కూడా అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి హారిక స్పష్టం చేశారు. కాగా పిహెచ్‌సి ద్వారా మండల పరిధిలోని ప్రజలకు, గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై న్యాయమూర్తి వాణి


మందులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి వాణి

ఆరా తీశారు. వైద్య శిబిరంలో ఎస్.కోట సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యన్నారాయణ, సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, డబ్ల్యు.ఎన్. శర్మ, టీవీఆర్ మూర్తి, ఎల్.అప్పారావు, బొడ్డు వెంకటరావు, పిహెచ్‌సి, సిహెచ్‌సిఒ ఎం.తారకరావు, వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి అన్నారు. గొల్లపల్లిలో సోమవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలరన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. ప్రసవించిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పెట్టాలన్నారు. తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమాంతం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కె.గోవిందమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తెర్లాం: మండలం కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంతో పాటు పనుకువలస, వెలగవలస గ్రామాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాడంగి ఐసిడిఎస్ పిఒ కే. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని చెప్పారు. అనంతరం అంగన్వాడి కేంద్రాల్లో స్టాకు రికార్డులను మెనూ అమలు చేసే తీరును గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-2లో గర్భిణులకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో పెరుమాలి సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టమ్మ, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఎఎన్ఎంలు, అంగన్వాడి సిబ్బంది, బాలింతలు, పిల్లలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పారసాంలో జరిగిన జిల్లా స్థాయి వాలీ బాల్ డే, నైట్ పోటీల విజేతలకు ఎయిమ్ విద్యాసంస్థల అధినేత, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ బహుమతులను అందజేశారు. గ్రామానికి చెందిన సంగంరెడ్డి జగదీష్ మెమోరియల్ వాలీ బాల్ పోటీలు సాయి యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విజయనగరం రూరల్ మండలం కొండకరకాం యూత్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆనంద్

ప్రథమ స్థానం, రాజీవ్ స్టేడియం యూత్ ద్వితీయ స్థానం, ఎంఆర్ స్టేడియం యూత్ తృతీయ స్థానం, ముద్దూరు యూత్ నాలుగవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ పోటీల్లో గెలిచిన విజేత జట్లకు ప్రథమ స్థానం రూ.15వేలు, ద్వితీయ స్థానం రూ.10వేలు, తృతీయ స్థానం రూ.5వేలు, నాల్గో స్థానానికి రూ.2500 నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొలజాన నారాయణరావు, ఎంపిటిసి సంగంరెడ్డి జగన్నాథం, నాయకులు తర్లాడ శంకరరావు, సాయి యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అస్తవ్యస్తంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామాల్లో ఇంటింటి కులాయి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు సగం సగం పనులతో రోడ్లను అస్తవ్యస్తం చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఎంపిడిఒ చంద్రకళకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సిసి రోడ్లను జెసిబిలతో తవ్వేసి పైపులైన్లను సకాలంలో వేయడం లేదని అన్నారు. తవ్వేసిన సిసి రోడ్లను కనీసం పూడ్చేందుకు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో సిమెంట్ రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని చోట్ల పైప్‌లైన్లు వేసి పనులు పూర్తయినప్పటికీ వాటిని ప్రారంభించడం లేదని తెలిపారు. దీంతో ప్రజలు తాగునీటికీ చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై గ్రామీణ సరఫరా విభాగం ఇఇతో పాటు డిఇకి కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పనులు పరిశీలించిన తర్వాతే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వాలని అంతవరకు నిలిపివేయాలని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

సాగునీటిని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుర్ల

రైతులందరూ సక్రమ పద్ధతిలో సాగునీటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట రావు అన్నారు. ఆయన సోమవారం గడిగెడ్డ నుంచి ఖరీఫ్ పంటకు సాగు


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

నీరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిగెడ్డ కింద ఆయకట్టు రైతులు సాగునీరును సక్రమంగా వాడుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. గడిగెడ్డ విస్తీర్ణం, ఆయకట్టు విస్తీర్ణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడిగెడ్డకు తోటపల్లి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు, కుచర్లపాటి త్రిమూర్తులు రాజు, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, తిరుములరాజు కిరణ్ కుమార్, బీసీ సెల్ సెక్రెటరీ దాసరి శివ ప్రసాద్, ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, ఇరిగేషన్ ఈఈ సీతారాం, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపిడిఒ వెంకటరమణ, పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం పోలీసు స్టేషన్‌లో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడుకు 20 ఏళ్ల జైలు, 5,500 నగదు జరిమానా విధించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ సోమవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం పట్టణం, కొత్తవలసకు చెందిన పడగ సాయి మనోజ్ కుమార్ (27)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కే. నాగమణి ఈ శిక్ష విధించినట్లు తెలిపారు.

అనకాపల్లి జిల్లా మునగపాక మండలానికి చెందిన ఒకామె భోగాపురం మండలం మహారాణిపేట వద్దగల ఒక కళాశాలలో బి.ఫార్మసీ చదువుతూ, స్నేహితులతో కలిసి ఒక గదిని అద్దెకు తీసుకొని ఉండేది. ఆమెకు ఫేస్ బుక్ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణం కొత్తవలసకు చెందిన నిందితుడు పడగ సాయి మనోజ్ కుమార్ పరిచయమయ్యాడు. తరుచూ ఇరువురూ కలిసేవారు. నిందితుడు పడగసాయి మనోజ్ కుమార్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి, తరువాత పెళ్లికి నిరాకరించాడు. దీంతో సదరు విద్యార్థిని భోగాపురం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును అప్పటి డిఎస్‌పిలు బి. మోహనరావు, పి.వీరాంజనేయ రెడ్డిలు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. మనోజ్‌కుమార్ మైనరుపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కంచేరు రెవెన్యూలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను భూగర్భ అధికారులకు అప్పజెప్పినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - విజయనగరం కోట

యువతి అదృశ్యంపై రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. అలబోని రాంబాబు కూతురు కావేరి(19) మిస్ అయినట్లు తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక వీటి అగ్రహారం 35వ డివిజన్ సంతోష్ నగర్‌లో తాను కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నానని, ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటి వద్ద నుంచి బయలుదేరి తాను చదువుతున్న విటిసి ఐటిఐ చెల్లూరుకు బయలుదేరి వెళ్లిన తన కూతురు కావేరి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మాయి స్నేహితులను వారి బంధువులు ఇళ్ల వద్ద విచారించినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి. శ్యామల తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వేపాడ

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఇఒలు జి. జగదీశ్వరరావు, పి. బాలభాస్కరరావు కోరారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదిన జరగబోయే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడ ఎలాంటి అసంఘటిత కార్యక్రమాలకు చోటులేకుండా ఎన్నికలను విజవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని కోరారు. అంతరం రోజువారీగా నిర్వహించాల్సిన టీచర్ అటెండెన్స్, విద్యార్థుల అటెండెన్స్, ఎండిఎం ఫోటోస్, మీల్ టేకెన్ పై చర్చించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

బక్కునాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను టాయిలెట్స్, పీఎం పోసిన పరిసరాలను, తరగతి గది నిర్వహణను టీఎల్ఎంను, గోడ పత్రికలను, పరిశీలించారు.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VIZIANAGARAM
I.A.190/2024 in O.S.34/2024

Between:
Smt. Chintala Harini Lakshmi Devi ...Petitioner/Plaintiff
And:
Sri Chodavarapu Srinivasa Rao ...Respondent/Defendant

SUMMONS/NOTICE

To, **Respondent/Defendant:**
Sri Chodavarapu Srinivasa Rao,
S/o. late Appala Naidu,
Hindu, R/at Timidi Village,
S-Kota Mandal,
Vizianagaram District.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above I.A.190/2024 in O.S.34/2024 against you. Number of times the Hon'ble Court ordered notice to the Respondent/Defendant, through Court and by registered post, in all the times summons/ notices were returned unserved and the Hon'ble Court was pleased to issue summon/notice through this paper publication.The said matter stands posted to **12-08-2024** for your appearance. You are hereby required to appear before the above named Court either in person or through duly instructed Advocate on **12-08-2024** at **10:30 A.M.**, failing which the matter will be proceeded in your absence as exparte.

N.S. GANGADHARAM,
Advocate,Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
I.A.368/2019 IN F.D.I.A.610/2017 IN O.S.69/1975

Between
Khatija Sultan and others .....Petitioners.
And
1) Hyder Ali Khan (Died)
2) Hasan Begum (Died).
3) Sakeena Begum w/o M.N. Ali, D.No.30-22-26, Durga Agraharam, Vijayawada.
4) Bilkush Sultana W/o A.A. Juddy, GCIM-11, Nageswara Iyer road, Nungambakkam, Chennai-34.
5) Nawab Mirza Mohammed Sadak Ali Khan @ Hassan S/o Late Hyder Ali Khan, Suddaveedhi, Vizianagaram town and District.
6) Nawab Subhan Ali Khan @ Hussain, S/o Late Hyder Ali Khan, Suddaveedhi, Vizianagaram town and District.
........Respondents.

NOTICE

Please take notice that the petitioner filed the petition to set aside exparte order in F.D.I.A.610/2017 and the above matter stand posted on dt.22-08-2024 for your appearing. Hence you are required to attend on **dt.22-08-2024 by 10:30 am** personally or through Advocate. As otherwise matter will be decided as per procedure.

Dt.05-08-2024.
Vizianagaram.

Shaik Rahim., M.A, ML
ADVOCATE VIZIANAGARAM
Ph. 9440540386.